తాండా అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-కోహిర్

మండలంలోని పీచరాగడితాండా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సజ్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కె ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం పిచేర్యాగడి పాతతాండ గ్రామ పంచాయతీలో గల కొత్త తాండాలోని అన్ని గల్లీలు తిరిగి అక్కడ నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెల్సుకున్నారు. కొత్త, పాత తండాల్లో వున్నా అన్ని గల్లీలో సైడ్ డ్రిన్, గుంతలు పడ్డ రోడ్డులను మొరం పోయించి మరమ్మతులు చేయిస్తానన్నారు. తాండాలోని సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. అలాగే మిగిలిన సైడ్ డ్రిన్ పనులు మొత్తం పూర్తి చేసి తాండా ప్రజలు రోగాల బారిన పడకుండా చేస్తానన్నారు. ఈ సందర్భంగా తాండా వాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పులమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వినోద్ కుమార్, తుకారాం తాండ కాంగ్రెస్ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర ఆధ్వర్యంలో అలయ్-బలయ్



నవతెలంగాణ-చౌటకూర్

విజయదశమిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం తాడ్‌దాన్‌పల్లి చౌరస్తాలో గల ఎమ్‌యస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆధ్వర్య ంలో అలయ్-బలయ్ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమా నికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరైనట్టు పార్టీ చౌటకూర్ మండలా ధ్యక్షులు నత్తి దశరథ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని.. చేప ట్టిన ప్రతీ పనిలో విజయం చేకూరాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంల ోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

అతివేగంగా అజాగ్రత్తగా బైకును నడిపి తనతో పాటు మరో వ్యక్తి మరణానికి ఓ యువకుడు కారణమయ్యాడు. సిద్దిపేట టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన మూడీకే మల్లేశం (33) హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. దసరా పండుగ సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన అతను ఆదివారం మిట్టపల్లి గ్రామంలో స్నేహితులతో కలిసి పార్టీలో పాల్గొని సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి పయనమయ్యాడు. ఈ క్రమంలో సిద్దిపేట పట్టణ శివారులోని కరీంనగర్ బైపాస్ రోడ్డులో తమిళనాడు దాబాల వద్ద వేగంగా బైకును నడుపుతూ రోడ్డుపై నడుస్తూ వెళుతున్న ఒక వ్యక్తికి ఢీకొట్టాడు. అదే స్పీడుతో ముందుకు వెళ్లి టీ తాగేందుకు వెళ్తున్న బీదర్‌కు చెందిన లారీ డ్రైవర్ రసూల్ ఖాన్(35)కు వేగంగా ఢీకొట్టాడు. దీంతో రసూల్ ఖాన్ అక్కడికక్కడే మరణించగా, మల్లేశం కొద్దిదూరం అలాగే వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మల్లేశం అన్న పర్శయ్య వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ సహాయంతో మల్లేశంను సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలిస్తుండగా, అతను మార్గమధ్యంలో చనిపోయాడు. లారీ డ్రైవర్ రసూల్ ఖాన్ అన్న అంజత్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

చేపల వలలో చిక్కి యువకుడు మృతి



నవతెలంగాణ-దుబ్బాక

చేపలు పట్టేందుకు వేసిన వలలో చిక్కి యువకుడు మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన పెంటం రమేష్ (35) వృత్తిరీత్యా చేపలు పడుతూ ఉండేవాడు. శనివారం ఉదయం చేపలు పట్టేందుకు వెళుతున్నానని చెప్పిన రమేష్ ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పట్టణ కేంద్రంలోని ఎదుల్లా చెరువు గట్టుపై రమేష్ ద్విచక్ర వాహనం, చెప్పులు కనిపించాయి. చెరువులో వెతకగా రమేష్ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట జూనియర్ పంచాయతీ కార్యదర్శి సర్వ నాగలక్ష్మి, ఎంపీఓ ఇందిరమ్మ, సంజీవరావుపేట గ్రామ ప్రత్యేక అధికారి, నారాయణఖేడ్ వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి కె.వెంకట్ రెడ్డిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబాని ఆదేశించారు. దాంతో పంచాయతీ కార్యదర్శిని జిల్లా అధికారులు సస్పెన్షన్ చేశారు. బాధితులకు వైద్య సహాయం అందించడం, రక్షిత మంచినీరు సరఫరా కోసం ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకోవడంలో పంచాయతీ కార్యదర్శి విఫలం చెందడం.. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడంలో విఫలం చెందడం, గ్రామ పంచాయతీ పరిధిలో రక్షిత మంచినీటి సరఫరా పనులు పర్యవేక్షించడంలో విఫలం చెందడంతో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 43(5) ప్రకారం పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఎంపీఓ ఇందిరమ్మ, గ్రామ ప్రత్యేక అధికారి కే .వెంకటరెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంపీఓపై, గ్రామ ప్రత్యేకాధికారిపై ఎందుకు చర్య తీసుకోకూడదు వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఆదేశిం చారు. సస్పెన్షన్ గడువు ముగిసే వరకు పంచాయతీ కార్యదర్శి హెడ్ క్వార్టర్లు అందుబాటులో ఉండాలని షోకాజ్ నోటీసులో ఆదేశించారు.

ఇద్దరు ఏఈలు సస్పెండ్..

నవతెలంగాణ- నారాయణఖేడ్‌రూరల్

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట గ్రామంలో కలుషితం నీరు తాగి ఇద్దరు మరణించగా.. 60మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం విధితమే. ఈ ఘటనలో ఇద్దరు ఏఈలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖేడ్ మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ రవికుమార్, ఇంట్రా ఏఈ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని గ్రిడ్ డీఈఈ గాయత్రి తెలిపారు.

మంత్రి దామోదర్‌ను కలిసిన తోపాజి అనంత కిషన్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మెన్ తోపాజి అనంత కిషన్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు గంగేరి శ్రీహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన పట్నం మాణిక్యం, పట్నం రవితేజ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన అలయ్-బలయ్ కార్యక్రమా నికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ యువ నాయకులు పట్నం రవితేజలు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

నీటిలో పడి పోస్టల్ ఉద్యోగి మృతి

నీటిలో పడి మృతి చెందిన పోస్టల్ ఉద్యోగి నితిన్ కుమార్

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్,

నీటిలో పడి పోస్టల్ ఉద్యోగి (పోస్టుమాస్టర్) మృతి చెందిన సంఘటన సోమవారం సిద్దిపేటలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట సుభాష్ నగర్‌కు చెందిన నితిన్ కుమార్ (22) పోస్టుమాస్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 13వ తేదీన మధ్యాహ్న సమయంలో తన స్నేహితులతో కలిసి ఇంటి నుండి బయటకు వెళ్లి రాత్రి సమయమైనా తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా తాత గారి ఇంటి వద్ద ఉన్నానని ఇక్కడే ఉంటానని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెతకడం మానేశారు. సోమవారం ఉదయం నుండి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు స్నేహితులతో కలిసి వెతుకులాట ప్రారంభించగా సిద్దిపేట సమీపంలోని వెలమ ఫంక్షన్ హాల్ వెనకాల గల తిమ్మికుంట వద్ద చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి వెతకగా తిమ్మికుంటలో నితిన్ శవం దొరికినట్లు పోలీసులు తెలిపారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేయాలని మృతుడి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలుషితమవుతోన్న...
మిషన్ భగీరథ నీళ్లు





- బోరునీళ్ల ట్యాంకులకే శుద్ధి చేసిన నీళ్లు
- ట్యాంకుల నిర్వహణ, శుభ్రత పట్ల నిర్లక్ష్యం
- పంచాయతీలకు పాలకవర్గాలు, నిధుల్లేవు
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపం
- సంజీవరావుపేట మంచినీళ్ల బావిలో కుక్క శవం
- అందుకే అస్వస్థత...ప్రాణాప్రాయ పరిస్థితి
- నారాయణఖేడ్‌లో ఇద్దరు అధికారులపై వేటు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

శుద్ధి చేసిన రక్షిత మంచినీళ్లు కలుషితమవుతున్నాయి. మిషన్ భగీరథ రక్షిత మంచినీటి సరఫరాలో సమన్వయ లోపం వల్ల బోరు నీళు నింపే ట్యాంకుల్లోకే మిషన్ భగీరథ నీళ్లను నింపుతున్నారు. ట్యాంకుల్ని శుభ్రం చేయకపోవడం, నీటి సరఫరా నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. వాటర్ ట్యాంకుల్ని నింపడం వరకే తమ బాధ్యతని మిషన్ భగీరథ అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ట్యాంకుల నుంచి ఇంటింటికీ నీటిని సరఫరా చేయాల్సిన పంచాయతీ, మున్సిపల్ అధికారులు నిధులలేమి, సిబ్బంది కొరత చూపి చేతులెత్తేస్తున్నారు. దీంతో వేల కోట్లు ఖర్చు చేసిన మిషన్ భగీరథ ప్రాజెక్టు ఉనికే ప్రశ్నార్థంగా మారుతోంది. నారాయణఖేడ్ ప్రాంతంలో ఓ బావిలోకి మిషన్ భగీరథ నీళ్లను నింపి వాటినే ప్రజలకు సరఫరా చేయడం, ఆ బావిని శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందగా 60 మంది వరకు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. బావిలో కుక్కపడి చనిపోయినా ఎవరూ తీయకపోవడంతో అది కుళ్లిపోయినందున్నే బావి నీళ్లు తాగిన ప్రజలకు ప్రాణాప్రాయ పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజలకు రక్షిత మంచినీటిని సరిపడ అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 ఎల్‌పీసీడీ, మున్సిపాలిటీ/నగర పంచాయతీల్లో 135, మున్సిపల్ కార్పొరేషన్‌లో 150 ఎల్‌పీసీడీ శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని అందించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 943 నివాస ప్రాంతాల్లో 792 ఓహెచ్ఎస్ఆర్‌లున్నాయి. 289261 ఇళ్లకు నల్లా కనెక్షన్లున్నాయి. మెదక్ జిల్లాలో 946 ఆవాస గ్రామాలుండగా 668 ఓహెచ్ఎస్ఆర్‌ల ద్వారా 188244 ఇంటి కనెక్షన్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 954 ఆవాస గ్రామాలకు నీరందించేందుకు 750 ఓహెచ్ఎస్ఆర్‌ల ద్వారా 2.75 లక్షల ఇళ్లకు రక్షిత మంచినీటిని అందిస్తున్నారు.

ప్రతి ఇంటికీ కావాల్సినన్ని మంచినీళ్లను సరఫరా చేయాలనే గత ప్రభుత్వ లక్ష్యం అనేక ఒడుదొడుకులకు గురవుతుంది. మంచినీటి వ్యవస్థను సక్రంగా నిర్వహించకపోతే ఎవడికి వాడే యమునా తీరే అన్నట్లుగా ఉంటది.

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం

మిషన్ భగీరథ తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు మూడు జిల్లాల్లో వేలాది కోట్లను వెచ్చించి ప్రాజెక్టును పూర్తి చేశారు. ఇంటింటికీ నీటిని సరఫరా చేసే పెద్ద వ్యవస్థ ఉన్నప్పటికీ ఇంకా కొన్ని సమన్వయ సమస్యల వల్ల ప్రజలకు రక్షిత నీరు అందట్లేదు. ఇప్పటికీ ప్రాజెక్టులో ఇంటింటికీ నల్లా బిగింపు 100 శాతం పూర్తికాలేదు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేసిన నీటిని ఊర్లలోని ట్యాంకుల వద్దకు తీసుకెళ్లి ట్యాంకు నింపడం వలరకే మిషన్ భగీరథ సంస్థ తన బాధ్యతగా భావిస్తుంది. ఊర్లోన్ని నీటి ట్యాంకుల్ని నింపడం, ఇంటింటికీ నల్లాకు నీటిని సరఫరా చేయడం అనేది గ్రామ పంచాయతీ చూసుకోవాలి. మల్టీపర్పస్ వర్కర్‌ను వాటల్ లైన్‌మెన్‌గా కేటాయించారు. ట్యాంకుల్ని శుభ్రం చేయడం, ఇంటింటికీ నల్లాలకు నీటిని సరఫరా చేయడంలోనూ అధికారుల లోపాలు కనిపిస్తున్నాయి.

రక్షిత నీరు కలుషితం...

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో క్లోరినేషన్ చేసి శుద్ధిచేసిన రక్షిత మంచినీటిని తీసుకెళ్లి ఊర్లల్లోని బోరింగ్ నీళ్లు నింపే ట్యాంకుల్లోకి ఎక్కిస్తున్నారు. ఒక పక్క రక్షిత మంచినీళ్లు ఇంకో పక్కన స్థానిక బోరు నీళ్లను ఒకే ట్యాంకులో నింపడం వల్ల రక్షిత నీరు కాస్త కలుషిత నీరుగా మారుతోంది. మిషన్ భగీరథ కోసం ప్రత్యేకంగా ట్యాంకుల్ని నిర్మించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచిస్తలేదు. ఊర్లో ఉన్న ఒకటి రెండు ట్యాంకుల్నే నింపి మమా అనిపిస్తున్నారు. నీటి సరఫరాలో అక్కడక్కడ పైప్‌లైన్లు పగలడం, లీకవ్వడంతో తాగే నీళ్లు కలుషితం అవుతున్నాయి. ట్యాంకుల్ని నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమవుతున్నాయి.

పంచాయతీలకు పాలకవర్గాలు, నిధుల్లేవు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి పాలక వర్గాల్లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. పంచాయతీ కార్యదర్శి, మరో ప్రత్యేక అధికారి ఇద్దరు సమన్వయంతో పాలక వర్గాలు చేసే పని చేయాలి. కానీ..! అలా జరగట్లేదు. పాలక వర్గాల్లేకపోవడం వల్ల రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. పైప్‌లైన్ల రిపేర్లు, ట్యాంకుల క్లోరినేషన్ పని ఆగిపోయింది. పాలక వర్గాలు అప్పు చేసి నిర్వహణ చూసేది. ఇప్పుడు అధికారులు ఆ రిస్క్ తీసుకోవడంలేదు. పైగా ఆర్నేళ్లకు పైగా ఎన్నికలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయలు ఆగిపోయాయి.

సంజీవరావుపేట బావిలో కుక్క శవం..?

నారాయణఖేడ్ మండలంలోని సంజీవరావుపేట గ్రామంలో ఓ బావి నీళ్లు తాగినందుకు 60 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు మరణించారు. అయితే ఊర్లో ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ నీళ్లను రెండు ట్యాంకులు, ఒక బావిలోకి సరఫరా చేస్తున్నారు. చెర్వు పక్కనే ఉన్న ఓ బావిలో మిషన్ భగీరథ నీళ్లను నింపి వాటిని ప్రజలకు ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. చెర్వు పక్కనే ఉండడంతో కలుషిత ఊట నీళ్లు బావిలోకి చేరుతున్నాయి. పైగా ఆ బావిలో ప్లాస్టిక్ డబ్బాలు, చెట్ల వేర్లు, బాయంతా పాకురుపట్టిపోయింది. పైగా ఇటీవల కుక్క బావిలో పడి చనిపోయినట్లు తెలుస్తోంది. శవం నీటిలో కుళ్లిపోయినందునే ఆ నీళ్లను తాగిన ప్రజలు అస్వస్థతతకు గురైనట్లు విశ్వసనీయ సమాచారం.

అధికారులపై నామమాత్రపు చర్యలు

సంజీవన్‌రావుపేటలో విచారణ జరిపిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఏఈలు రవికుమార్, శ్రీకాంత్‌లను సస్పెన్షన్ చేస్తూ ఈఎన్‌సీ కృపారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పంచాయతీ సెక్రటరీ నాగలక్ష్మిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎంపీఓ ఇందిరమ్మ, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలకు షోకాజ్ నోటీసులిచ్చారు.

సీపీఎం చొరవతోనే అధికారులపై చర్యలు

సంజీవరావుపేటలో 60 మంది అస్వస్థతకు గురైన సంఘటనపై క్షేత్రస్థాయిలో నారాయణఖేడ్ ఏరియా సీపీఎం కార్యదర్శి రమేష్ ఇతర నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుభ్రంలేని బావిలోకి మిషన్ భగీరథ నీళ్లను ఎక్కించడం, దాన్ని శుభ్రం చేయకపోవడం సరైంది కాదన్నారు. ట్యాంకుల్ని శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. దీంతో ఫీల్డ్‌లో విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఇద్దరు అధికారుల్ని సస్పెండ్ చేశారు.

ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలెక్కడా?

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-జోగిపేట

ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని.. కేసీఆర్ ఇచ్చిన వాటినే ఇప్పుడిచ్చి డబ్బా కొట్టుకుంటున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్-బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. నారాయణ ఖేడ్ నియోజకవర్గం సంజీవరావుపేటలో కలుషిత నీళ్ళు తాగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా సురక్షిత నీళ్ళు ఇస్తే, కాంగ్రెస్ మంచినీళ్లు కూడా అందించలేకపోతుందన్నారు. రైతుబంధు లేదు, బతుకమ్మ చీరెలు లేవు, రుణమాఫీ రాలేదన్నారు.డిసెంబర్ 9 పోయింది, పంద్రాగస్టు పోయింది. నిన్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ డిసెంబర్ 9కి రుణమాఫీ పూర్తి చేస్తాం అంటున్నాడని.. ఇలా ఏడాది కాలం గడిపారన్నారు. కాగా అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని రేపిందని, పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్, యాదవ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, శివకుమార్, విజయ్. సాయికుమార్, నాగభూషణం, చాపల వెంకటేశం, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం

మతోన్మాద రాజకీయాలను తిప్పి కొట్టాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కారాములు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఐలాభవన్‌లో సోమవారం జరిగిన సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఏరియా రెండో మహాసభల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. అనంతరం ప్రతినిధుల సభలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఇతర సమస్యలను ముందుకు తేవడం సిగ్గుచేటన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడాలని, మతోన్మాదం పెరగడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజల మధ్య చీలికలు వస్తున్నాయన్నారు. ఈ చీలికల రాజకీయాలను బీజేపీ మానుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కార్పొరేటికరణ విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ప్రజా, రైతు, కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీలన్నింటిని అమలు చేయాలని ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను సమస్యల ప్రాతిపదిగా సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య పటాన్‌చెరు ఏరియా నాయకులు వాజీద్ అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, పెంటయ్య, జార్జ్, సునీత, లలిత, బీవీఆర్ కె రాజు, రమణారెడ్డి, సురేందర్ రెడ్డి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పై పోరాడేది ఎర్రజెండానే..

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు
పార్టీ జహీరాబాద్ ఏరియా మహాసభలో జిల్లా కార్యదర్శి జయరాజు



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడేది కేవలం ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా 2వ మహాసభలను స్థానిక భీమ భవన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ముందుగా పార్టీ ఎర్రజెండాను ఆవిష్కరించి.. అనంతరం అమరవీరులకు నివాళ్లర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ అగ్రనేత కామ్రేడ్ సీతారాం ఏచూరి, జహీరాబాద్ ఏరియా నాయకులు ప్రకాష్, ఎసయ్యా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేస్తూ గద్దెనెక్కినాక ప్రజలను మర్చిపోతున్నాయన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్ల కు ఊడిగం చేస్తున్నదన్నారు. ధరల పెరుగుదలను అదుపు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ప్రభుత్వంపై వస్తున్న సంతృప్తిని సైడ్ చేయడం కోసం మతోన్మాద ఎజెండాను అమలు చేస్తున్నదన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడి చేస్తున్నదన్నారు. వాటిని ప్రజలు ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణిలో పేదల అసైన్మెంట్ భూములకు నేటికీ అనేక గ్రామాల్లోపట్టా పాస్ పుస్తకాలు రాలేదన్నారు. ప్రజలకు అండగా ఎల్లప్పుడూ ఎర్రజెండా ఉంటుందన్నారు. పేదలకు భూములు పంచి, ఇళ్ల స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టు ఎర్రజెండానే అని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ సభలో సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి రాంచందర్, కమిటీ సభ్యులు మహిపాల్, నర్సయ్య, చంద్రన్న, కనకరెడ్డి, సంగన్న, నర్సిములు, తుల్జరం, నరేష్,ఫహీమ్, శంకర్,దశరాత్, వీరయ్య గౌడ్, రాజిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మృతి

పాడే మోసి నివాళ్లర్పించిన మాజీ ఎమ్మెల్యే





నవతెలంగాణ-మునిపల్లి

తెలంగాణ ఉద్యమకారుడు, మునిపల్లి మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అల్లం నవాజ్ రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలిసి.. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, బిక్షపతి మండల టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్ తదితరులు తాటిపల్లి గ్రామానికి వెళ్లి నవాజ్ రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అంతకుముందు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో సీనియర్ నాయకుడిగా నవాజ్‌రెడ్డి ఎంతో పని చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాడే మోసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. పార్టీలో దశాబ్దాల కాలం నుంచి నవాజ్‌రెడ్డి పాత్ర ఎంతో కీలకమైనదని.. తెలంగాణ సాధన పోరాటంలో కీలకపాత్ర వహించారని కొనియాడారు. నవాజ్‌రెడ్డి మరణం బాధాకరమని, పార్టీకి తీరని లోటు అని అన్నారు.

దుద్దెడ టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జాం

- ట్రాఫిక్‌లో అవస్థలు పడ్డ ప్రయాణికులు నిక్కచ్చిగా టోల్ రుసుం వసూలు చేసిన హెచ్‌కెఆర్ టోల్ ప్లాజా సిబ్బంది



నవతెలంగాణ-కొండపాక

బతుకమ్మ దసరా పండుగలకు సొంత ఇళ్లకు చేరుకున్న ప్రయాణికులు తిరిగి హైదరాబాద్ ముఖం పట్టడంతో సోమవారం రాజీవ్ రహదారిపై దుద్దెడ టోల్ ప్లాజా వద్ద భారీగా టాట్రాఫిక్ జావమ్ ఏర్పడింది. టోల్ ప్లాజా సిబ్బంది టోల్ రుసుము వసూలు చేయడం మూలంగా మధ్యాహ్నం నుంచి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్ సుమారు మూడు కిలోమీటర్ల మేర కొనసాగడంతో దుద్దెడ టోల్ ప్లాజా నుంచి కలెక్టరేట్ వరకు ఐదు లైన్లుగా కార్లు, ఇతర వాహనాలు భారీగా వేల సంఖ్యలో ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. సుమారు రెండు గంటలకు పైగా ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాలకు సైతం టోల్ ప్లాజా యజమాన్యం టోల్ రుసుము వసూలు చేశారు. టోల్ ప్లాజా యాజమాన్యం ఇదే అదునుగా భారీ మొత్తంలో టోల్ రుసుమును వసూలు చేసింది. టోల్ ప్లాజా హైవే నియమాల ప్రకారం 10 నిమిషాల కంటే ఎక్కువ నిలిచిన వాహనాలకు టోల్ ప్లాజా రుసుము వసూలు చేయొద్దు అన్న నిబంధన ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా దుద్దెడ టోల్ ప్లాజా యాజమాన్యం ప్రయాణికుల నుంచి ఫాస్ట్యాగ్ రూపంలో నిక్కచ్చిగా టోల్ రుసుమును వసూలు చేయడం ప్రయాణికులను విస్మయానికి గురిచేసింది. ఇంత భారీ ఎత్తున దసరా సమయంలో టోల్ ప్లాజా ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించడానికి టోల్ ప్లాజా యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు అవస్థలు పడే విధంగా హెచ్‌కెఆర్ హైవే యాజమాన్యం వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ట్రాఫిక్ దృష్ట్యా సంబంధిత పోలీస్ శాఖ నుంచి కూడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

వాస్తుశిల్పికి సృజన అవశ్యం



నవతెలంగాణ-పటాన్‌చెరు

నిర్మాణ రూపకల్పన (ఆర్కిటెక్చరల్ డిజైన్)లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, ఆవిష్కరణలు అవశ్యమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియల్ డిజైనర్స్ (ఐఐఐడీ) నిపుణులు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్ విద్యార్థులు ఇటీవల లఖోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్‌లో ఐఐఐడీ నిర్వహించిన ఐత్రీ సిరీస్ ఐదో ఎడిషన్ లో పాల్గొన్నారు. ఆర్కిటెక్చర్ విద్యార్థులు, అనుభవజ్ఞులైన నిపుణుల మధ్య వారధిగా ఈ కార్యక్రమం పనిచేయడమే గాక, వారి నుంచి నేర్చుకోవడానికి, నిపుణులతో కొంత సమయం గడపడానికి తోడ్పడింది. నవీన్ పానుగంటి, షమిలా మీరన్, అమిత్ షాలతో సహా పేరొందిన ఆర్కిటెక్టులు తమ వృత్తిపరమైన ప్రయాణాలు, డిజైన్ మెళకువలను విద్యార్థులతో పంచుకున్నారు. తరువాతి తరం వాస్తు శిల్పులను ప్రేరేపించడం, విద్యావంతులను చేయడం యొక్క ప్రాముఖ్యతను వారు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలకు వారు వివరణాత్మక జవాబులిచ్చి ఆకట్టుకున్నారు. అంతే కాక, గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఐఐఐడీ విద్యార్థి సభ్యత్వ ధృవీకరణ పత్రాలను ఇవ్వడం విశేషం.ఆర్కిటెక్చరల్ ఎడ్యుకేషన్, ప్రొఫెషనల్ ఎదుగుదల రెండింటినీ ప్రోత్సహిస్తూ ఐఐఐడీ, గీతం ఆర్కిటెక్చర్ స్కూలు మధ్య కొనసాగుతున్న సహకారంలో ఇదో మైలురాయిగా నిలిచిపోనుంది. విద్యార్థులు, నిర్మాణ సంస్థల మధ్య సంబంధాలను పెంపొందించడంలో ఇది మరో విజయవంతమైన చొరవగా గుర్తించబడింది.

పిడుగుపాటుతో ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-వట్‌పల్లి

పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాత పడిన ఘటన వట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్వెల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్వెలి గ్రామానికి చెందిన రైతు చింతల గట్టు గ్రామ సమీపంలో చిన్నపాటి చెట్లకు పశువులను కట్టేశాడు. ఈ క్రమంలో సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగు పాటు ఓ ఎద్దు మృత్యువాత పడింది. ఆ ఎద్దు విలువ రూ.70 వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-రామచంద్రాపురం

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును పటాన్చెరువు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు సోమవారం దసరా పండుగ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, జిల్లా మాజీ గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ కుమార్ గౌడ్ మరియు పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హరీశ్‌రావును కలిసి సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు.



దామగుండం అడవుల్లో నేవి రాడార్ ప్రాజెక్టు నిలిపివేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణలోని దామగుండం అడవుల్లో నేవి రాడార్ ప్రాజెక్టును కొనసాగించొద్దని సామాజిక కార్యకర్త ఎం.శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా దామగుండం ఫారెస్ట్ రిజర్వులోని ప్రతిపాదిత విఎల్ఫ్ రాడార్ స్టేషన్ ప్రాజెక్ట్‌కి అవసరమైన, ప్రజా అభిప్రాయం, ప్రక్రియలు, అనుమతులు, పర్యావరణ ప్రభావ, అంచనా నివేదిక లేకుండా ప్రజా బహిరంగ విచారణ చేయకుండానే ప్రారంభం చేయడం అప్రజాస్వామికమన్నారు. దీని వలన జీవ వైవిధ్యం, పర్యావరణనికి భవిష్యత్‌లో నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



హరీశ్‌రావును సన్మానించిన నేతలు

నవతెలంగాణ-జిన్నారం

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశంతోపాటు బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ చెన్నంశెట్టి సూర్యనారాయణ ఉన్నారు.



గోల్డ్‌మెడల్ అందుకున్న విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని హార్ట్ రంగోత్సవంలో నేషనల్ ఇంటర్నేషనల్ గోల్డ్‌మెడల్ సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివరావు పటేల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఓ వరం

నవతెలంగాణ-జహీరాబాద్

నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రంజోల్‌కు చెందిన బి.తుల్జమ్మ భర్త కిష్టయ్యకు రూ.2 లక్షల 50 వేలు, హద్నూర్‌కు చెందిన పద్మ భర్త భోజి రెడ్డికి రూ.3 లక్షల విలువగల ఎల్వోసీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎమ్మెల్యేకి,నాయకులకు, ధన్యవాదాలు తెలిపారు.



చౌటకూర్ ప్రజావాణిలో ఒక ఫిర్యాదు



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక్కటే ఫిర్యాదు అందిందని తహసీల్దార్ ఈశ్వరా రాణి తెలిపారు. కళ్యాణ లక్ష్మికి సంబంధించిన వినతి అందిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తుల్జాపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతీయేడు లాగానే ఈ సంవత్సరం కూడా తుల్జాపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు తమ వార్డుకు చెందిన వార్డు మధుర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ అశోక్ శేరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాష్ దేవగిరి, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు



కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన వి.వరప్రసాద్ రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

దసరా పండుగను పురస్కరించుకొని పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌ని సోమవారం రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపాల్టీ కౌన్సిలర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన నివా సంలో కలిశారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్‌ని వరప్రసాద్ రెడ్డి ఘనంగా సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ చంద్రయ్య, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, స్థానిక నాయకులు చక్రపాణి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న రాకేష్ షేట్కార్, సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తిని ఆసుపత్రికి తరలించి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రాకేష్ షేట్కార్, సీపీఐ(ఎం) నేతలు నల్లవల్లి రమేష్, జంబల్ సంతోష్‌లు మానవత్వం చాటారు. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి ముడుగుటల వద్ద ప్రమాదం జరిగింది. గమనించిన వారు వెంటనే ఓ ఆటోలో ఆయన్ను ఆసుపత్రికి పంపించారు. బాధితుడి కుటుంబ సభ్యులు రాకేష్ షేట్కార్‌కు, సీపీఐ(ఎం) నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మత్తులు



నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండల కేంద్రం నుంచి జహీరాబాద్ పట్టణం వైపు వెళుతున్న ఆర్అండ్‌బి రోడ్డుపై బుడగజంగం కాలనీ సమీపంలో ఏర్పడ్డ గుంతలను తీన్మార్ మల్లన్న టీం జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి నర్సింలు ఆధ్వర్యంలో పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచి మోకాల్లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు గాయాలపాలయ్యారు. ఈనెల 06న 'గుంతల రోడ్లతో ప్రమాదాలు'అనే శీర్షికన నవతెలంగాణ ప్రచురించింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను నర్సింలు గుర్తించి దాతృత్వంతో సిమెంటు, ఇసుకతో గుంతలను పూడ్చారు. దాంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శివాలయానికి విరాళం

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా నిర్వహిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి సోమవారం యాదగిరి పల్లెకు చెందిన నోముల కమలమ్మ పర్వతాలు ఐదు వేల ఒక వంద పదహారు రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు ప్రతాపరెడ్డి, శంకరయ్య, ఫణి గుప్త,రాజు, పల్నాటి భాస్కర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి బీజేపీ ఎస్టీ అసెంబ్లీ కన్వీనర్‌గా నరేష్ నాయక్





నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఎస్టీ కన్వీనర్‌గా తెలంగాణ రాష్ట్ర ఎస్టీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ నాయక్, సంగారెడ్డి ఎస్టీ మోర్చా అధ్యక్షులు సంతోష్ రాథోడ్, కొండాపూర్ మండలం యువకుడు నరేష్ నాయక్‌ను నియమించినట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌కు దారేది?



- రోడ్డులేక అవస్థలు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోనే ఉంది. ఇక్కడ భూమి విలువ ఆకాశాన్ని అంటింది. ఎన్నో బహుళ అంతస్తుల నిర్మాణాలు, కాలనీలు వెలిసి లక్షల మంది జీవనం సాగిస్తున్నారు. కానీ ఇక్కడ రైల్వే స్టేషన్‌కు సరైన దారి లేక ప్రజలకు ఉపయోగపడటం లేదు. అవసరమైన రోడ్డు మార్గం లేక పోవడంతో తెల్లాపూర్ చుట్టుపక్కల ప్రజలు రైల్వే మార్గాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. పక్కనే ఉన్న రైల్వే స్టేషన్ కాకుండా 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో రోడ్డు ప్రయాణం చేసి.. లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఎంఎంటిఎస్ ఇతరత్రా రైళ్లలో ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఇక్కడ రైల్వే స్టేషన్‌కు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రైల్వే ట్రాక్‌కు అనుకొని ఉన్న మంజీరా పైప్‌లైన్ మార్గం గుండా స్థానికులు రాకపోకలు సాగించేవారు. కానీ ప్రస్తుతం ఈ మార్గంలో చెత్తాచెదారం కుప్పలు, శిథిల భవనాలు వ్యర్థాలు డంపింగ్ చేయడంతో ఆ దారి గుండా ఎవరూ కూడా ప్రయాణాలు సాగించట్లేదు. విద్యుత్‌నగర్ కాలనీ మీదుగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. కానీ అలా ఆ మార్గం మీదుగా తెల్లాపూర్ వాసులు వెళ్లాలంటే సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తున్నది. తెల్లాపూర్ చుట్టుపక్కల లక్షల మంది దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. వీళ్ళందరూ రైల్వే మార్గం గుండా ప్రయాణం చేయాలంటే కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి వెళ్ళాలి. తెల్లాపూర్ నుంచి కొల్లూరు రింగ్ రోడ్డు వరకు 7వ నెంబర్ రేడియల్ రోడ్డును ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఆ మార్గం మధ్యలోనే తెల్లాపూర్ రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ ఆ రోడ్డు రైల్వే స్టేషన్కు మధ్యలో కాల్వ ఉండడంతో స్టేషన్‌కు ప్రయాణికులు చేరుకోలేని పరిస్థితి ఉన్నది. ఇక్కడ చిన్న వంతెన లేదా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేదా ర్యాంప్ రోడ్డు నిర్మిస్తే తెల్లాపూర్, విద్యుత్ నగర్, ఉస్మాన్ నగర్, కొల్లూరు, ఈదుల నాగులపల్లి, వెలిమెల, పాటి, ఘన్పూర్ మొదలగు ప్రాంతాల ప్రజలకు ప్రయాణం చేసేందుకు సులభతరం అవుతుంది. మార్గాన్ని అభివృద్ధి పరిచి వెంటనే ప్రజలకు రైల్వే స్టేషన్‌కు సులభంగా చేరుకునేందుకు తగు చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.

రైళ్లను మెరుగుపరచాలి

లక్షల మంది నివాసం ఉంటున్న తెల్లాపూర్ ప్రాంత వాసులకు రైల్వే మార్గం ఎంతో అవసరం. తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌కు దారిని ఏర్పాటు చేయడ మే కాకుండా ఈ ప్రాంతంలో రైల్వే మార్గా న్ని పున రుద్ధరించి ఎక్కువ సంఖ్యలో ఎంఎంటీఎస్ మరి యు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైళ్లను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యం హైదరాబాద్ నగరానికి ఉద్యోగరత్యా వ్యాపార రీత్యా ప్రయా ణం చేసే వారికి ఎంఎంటిఎస్ రైళ్లు పెంచడం ద్వారా ప్రయాణం చేసేందుకు సులభతరం అవుతుంది.

-రవీందర్ రెడ్డి, కౌన్సిలర్, వెలిమెల

వినతులు ఇచ్చినా స్పందన లేదు

తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌కు దారి ఏర్పాటు చేయాలని అధికారులకు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేదు. వెంటనే రైల్వే స్టేషన్ వద్ద దారి సులభతరం చేసి ఈ ప్రాంత ప్రజలకు రైల్వే మార్గాన్ని వినియో గించుకునేందుకు దోహదపడాలి. ప్రజలకు ఉపయోగపడే విధంగా వెంటనే రైల్వే స్టేషన్ వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేసి రాకపోకలు సాగించేందుకు కృషి చేయాలి.

- ఉమేష్, ఉస్మాన్‌నగర్

రైల్వే స్టేషన్‌కు దారి ఏర్పాటు చేయండి

తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌కు దారి ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. 7వ నంబరు రేడియల్ రోడ్డుకు రైల్వే స్టేషన్కు అనుసంధానంగా వెంటనే ఆ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. రైల్వే స్టేషన్ కు దారి ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత వాసులు రైల్వే ప్రయాణం చేసేందుకు సులభతరం అవుతుంది.

- నరసింహ, మాజీ ఎంపీటీసీ, కొల్లూర్

సంజీవన్‌రావుపేట్ ఘటన బాధాకరం

- కలెక్టర్‌కు నివేదిక పంపిస్తా
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో కలిషిత నీళ్ల తాగి 60 పైగా మంది అవస్థతకు గురవడం.. అందులో ఇద్దరి మృతి చెందడం చాలా బాధాకరమని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సంజీవన్‌రావుపేట్ గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించి.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం కలుషిత నీటి బావిని పరిశీలించారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకూడదని అధికారులకు సూచించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కలుషిత నీరు తాగడం వల్లనే గ్రామస్తులు అస్వస్థతకు గురయ్యారన్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో.. బావి నుంచి మంచినీటి ట్యాంకులోకి నీరు పంపించారని.. ఆ నీరు తాగిన వారందరూ అస్వస్థకు గురయ్యారన్నారు. వాటర్ సప్లై మోటారు రిపేరు ఉండడం వల్ల నీరు ఆగిపోవడం జరిగిం దన్నారు. ట్యాంక్ నుంచి 120 మంది కుటుంబాలు నీరు తాగడం వలన అస్వస్థకు గురయ్యారన్నారు. ఎమ్మెల్యే పట్లోల డాక్టర్ సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఆర్డిఓ అశోక చక్రవర్తి, మిషన్ భగీరథ ఏఈలు వచ్చారన్నారు. గ్రామంలో వాటర్ సప్లయ్ లేకపోవడంతో ఇబ్బంది జరిగిందని.. రేపటి నుంచి యథావిధంగా నీరు వస్తుందన్నారు. ఇంతకుముందు కలుషితం తగిన మంచినీటి బావిని పూర్తిగా నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు. కొంతమంది అస్వస్థతకు గురైన వారిని సంగారెడ్డి, నారాయణ ఖేడ్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. అధికారులపై జిల్లా కలెక్టర్ నివేదిక పంపిస్తామన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి..

కలుషిత నీరు తాగి చనిపోయిన బాయికడి సాయవ్వ బుడ్డ మహేష్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. బాయికాడి సాయవ్వ అట్ల బతుకమ్మ రోజు ఆటాపాటతో సంబురంగా గడిపిందని.. ఎంతో ఆరోగ్యంగా గడిపిందన్నారు. కలిషిత నీరు తాగడం వల్లే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కిడ్నీలు ప్రాబ్లమ్స్ ఉండి డయాలిసిస్‌తో మృతి చెందడం అవాస్తమన్నారు. బుడ్డ మహేష్ ఆపెండీసైటీస్ ఉండి మంరణించడం అనేది అవాస్తమన్నారు. కలుషితం నీరు తాగి మరణించారన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే గ్రామానికి నీరు రాకుండా చేశారని పండుగ రోజు కుటుంబంలో సాయవ్వ చనిపోవడంతో కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయిందన్నారు.



యూనస్‌ను సన్మానించిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-జిన్నారం

ఎమ్మెల్సీ కవిత త్వరగా కోలుకోవాలని ఆమె వీరాభిమాని యూనిస్ కొల్చారం దర్గా వరకు పాదయాత్ర చేపట్టాడని బీఆర్ఎస్ జిన్నారం మండలాధ్యక్షులు రాజేష్ తెలిపారు. ఈ క్రమంలోనే ఆయనను బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి బృందం ప్రత్యేకంగా సన్మానించి అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్, నాయకులు భాస్కర్ రెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్ రెడ్డి, నరహరి, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పెంటయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు ఆశన్న గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్ మాట్లాడుతూ..1957లో కల్లుగీత కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్లు గీత కార్మికుల సంక్షేమం అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలో ప్రభుత్వా నికి తెలియజేసి, ఈ పదేండ్ల కాలంలో అనేక హక్కులను, సాధించుకున్నామన్నారు. ఈనెల 18న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు కల్లుగీత కార్మిక సంఘం 67 ఏళ్ల వార్షికోత్సవాలు సభ నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా కల్లుగీత వృత్తి ఉపాధి అవకాశాలపై సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెమినార్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ బీసీ సంక్షేమ శాఖ బూర వెంకటేశం, నూతి శ్రీకాంత్ గౌడ్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, రంగు బాల లక్ష్మి, బీసీ కమిషన్ మెంబర్, రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వి రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఇతర సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారన్నారు. కాబట్టి కల్లుగీతదారులందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, సంగారెడ్డి మండల ఉపాధ్యక్షులు కృష్ణ గౌడ్, నాయకులుశ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీని దెబ్బతీయాలనే ఆంక్షలు సరికాదు..

నవతెలంగాణ-జహీరాబాద్

ఎల్ఐసీని క్రమంగా దెబ్బతీయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల ఆంక్షలు విధిస్తూ రావడం సరికాదని ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టల్‌గౌడ్ అన్నారు. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా సోమవారం జహీరాబాద్‌లో కూడా బంద్ నిర్వహించి బ్రాంచ్ మేనేజర్‌కు మెమోరండాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐఆర్‌డి రోజురోజుకు కొత్త విధమైన ఆంక్షలు ఏజెంట్ల పై విధించడం సరికాదన్నారు. పాలసీదారుల వయస్సును 55 నుండి 50 సంవత్సరాలకు తగ్గించడం, ప్రీమియంను పెంచడం ప్రస్తుత ప్రీమియంకు కూడా 1000 నుండి 800 రూపాయల వరకు అదనపు భారం పాలసీ హోదాలపై మోపడంతో పాటు ఎల్ఐసి ఏజెంట్స్ కు ఇస్తున్న కమిషన్‌ను సైతం తగ్గించడం దుర్మార్గమన్నారు. అందుకే సోమవారం నుండి ఈనెల 28 వరకు వరుసగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏ ఒక్క ఏజెంట్ కూడా నూతన పాలసీలను చేయబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్ ఆర్ సుభాష్, రాజు, చంద్రరెడ్డి, అశోక్, నర్సింలు, రాములు, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.



12 దాటినా హాజరుకాని అధికారులు!

- అధికారుల్లేక బోసిపోయిన తహసీల్దార్ ఆఫీస్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నాగలిగిద్ద మండలం కేంద్రం తహసీల్దార్ కార్యాలయ అధికారులు సోమవారం రోజున మధ్యాహ్నం 12 గంటలు దాటినా విధులకు హాజరుకాలేదని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నల్లవెళ్లి రమేష్, పార్టీ నాయకులు సంతోష్ ఆరోపించారు. అధికారులు రాకపోవడంతో కార్యాలయంలో కుర్చీలన్నీ బోసిపోయాయన్నారు. ఆఫీస్‌కు వచ్చిన ప్రజలందరూ నిరాశగా వెనుదిరిగారన్నారు. దసరా సెలవులు ముగిసినా.. అధికారులు పనిలోకి రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఉన్నతాధికారులు స్పందించి.. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర

నవతెలంగాణ-అమీన్‌పూర్

మున్సిపల్ పరిధిలోని పెద్దచెరువు కట్టపై ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో పూజలు అందుకున్న దుర్గామాత నిమజ్జన కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వివిధ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలతో కోలాటాలు, యువకుల నృత్యాలతో శోభాయాత్ర ఘనంగా సాగింది. ఈ సందర్భంగా చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి చల్లని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురా రోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ శోభాయాత్రతోట నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ దీపాల అలంకరణ, సాంప్రదాయ బద్దమైన నృత్యాలు, కళాకారుల వేషధారణ, గ్రామస్తుల విశేష పూజలు ఈ శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నాయకులు ప్రతాపరెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లతోపాటు పలువురు స్థానిక నేతలు భవానీ మాలదారులు యువజనులు మహిళలు పాల్గొన్నారు.

హత్నూర : హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామంలో దుర్గమ్మ ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా సోమవారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆటపాటలతో భజనలు చేస్తూ పుర:వీధుల గుండా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : మండలంలోని మద్దికుంటలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం డప్పు వాయిద్యాలతో, డీజే పాటలతో అమ్మవారి ఊరేగింపును ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పట్నం మాణిక్యం, చింత సాయినాథ్, పట్నం రవితేజ, మద్దికుంట మాజీ సర్పంచ్ ఆరిఫోద్దిన్ పాల్గొని యువకులతో పాటు నృత్యాలు చేశారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన యువకులను అభినందించారు. ఉత్సవాల నిర్వహణ కోసం మాజీ సర్పంచ్ అరిఫోద్దిన్ రూ.1,50,000 తన వంతుగా సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో బేలూరి వెంకట్ రెడ్డి, కోలుకుందే గోవర్ధన్ రెడ్డి, తేర్పోలు విష్ణువర్ధన్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తుల్జా రెడ్డి, గ్రామ యువకులు, పెద్దలు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.









న్యాల్కల్ ప్రజావాణిలో 4 దరఖాస్తులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ భూపాల్ తెలిపారు. చీకుర్తిలో మిషన్ భగీరథకు సంబంధించి తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామ నాయకుడు జనార్ధన్ రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. అలాగే గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశాడు. అలాగే వడ్డీ గ్రామానికి చెందిన ఓ వికలాంగుడు పింఛన్ మంజూరు చేయాలని, న్యాల్‌కల్‌లో పాతబావి పూడ్చాలని మరొకరు ప్రజావాణిలో దరఖాస్తు చేశారన్నారు. మరోపక్క ప్రతీసారి ఆర్అండ్‌బి అధికారులు ప్రజావాణికి హాజరుకాకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ప్రజావాణికి హాజరుకాని సంబంధిత అధికారులపై తగు చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ వైర్లు

నవతెలంగాణ-ఝరాసంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సాయంత్రం ఒక్కసారిగా ఈదురురుగాలు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ ఘటన మచ్నూర్, క్రిష్ణాపూర్ శివారు మధ్య చోటు చేసుకుంది. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దాంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై తెగిపడిన వైర్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నిజాంపేట

మండలపరిధిలోని చల్మేడ గ్రామంలో గల ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో 2005-06 పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాడు విద్య నేర్పిన గురువులను పూలమాలలతో శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి గురువుల విద్యాబోధన వల్లనే తాము ఈ స్థాయికి చేరుకున్నామని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ ఆనందంగా జీవిస్తున్నామన్నారు. వారికి ఏమి ఇచ్చిన తక్కువేనని వారికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తిరుపతి, కన్యాలాల్, భూపాల్, వై.తిరుపతి, శంకర్, పృథ్వీదర్ రావు, రామచంద్రం, వేణుగోపాల్, సత్యం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకర్షనీయంగా కూచిపూడి నృత్యం



పలువురిని ఆకట్టుకున్న గడీల ధనప్రియ

నవతెలంగాణ-కొల్చారం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఎనగండ్ల గ్రామానికి చెందిన గడీల ధనప్రియ కూచిపూడి నృత్యం పలువురిని అలరించి, ఆకట్టుకుంది. సోమవారం ఎనగండ్ల గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఊరేగింపులో భాగంగా ఎస్ఎస్ డాన్స్ అకాడమి గడీల ధనప్రియ ఆకర్షణీయంగా కూచిపూడి నృత్యం చేస్తూ గ్రామస్తులను ఆకట్టుకుంది. అంతేకాకుండా ధనప్రియ తెలంగాణలో కాకుండా ఇతర రాష్ట్రాల్లో సైతం నృత్య ప్రదర్శనలు చేసి ఎన్నో అవార్డులు అందుకున్నట్లు స్థానికులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో డిఎస్సీ విజేతలకు సన్మానం



నవ తెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు డిఎస్సీ 2024లో ఎంపిక అయినందుకు వారిని ప్రిన్సిపల్, అధ్యాపకులు సన్మానించారు. ఆంగ్ల అధ్యాపకులు కె.రవీందర్ ఎస్జీటీ విభాగంలో 51 వ ర్యాంకును, హిందీ అధ్యాపకులు మొహమ్మద్ సమీ హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకును సాధించినందుకు వారిని కళాశాల బృందం ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా హుస్సేన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్ చెరువు తండాలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ



నవతెలంగాణ - నిజాంపేట

మండల పరిధిలోని జెడ్ చెరువు తండాలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్ ఇచ్చిన పిలుపుమేరకు గ్రామానికి వచ్చే ఇందిరమ్మ ఇళ్ళను పారదర్శకంగా మంజూరు చేయడం కోసమే ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ తాజా మాజీ సర్పంచ్ రావిపల్లి అమరసేనారెడ్డి, మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, బక్కన్న గారి లింగమ్ గౌడ్, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు నసీరుద్దీన్, జెల్లా లక్ష్మణ్ గౌడ్, సూరా రాములు, రమావత్ రాజు, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

12 గంజాయి మొక్కల స్వాధీనం



నవతెలంగాణ-వెల్దుర్తి

నమ్మదగిన సమాచారం మేరకు పొలంలో సాగుచేస్తున్న 12 గంజాయి మొక్కలను ఎక్సైజ్ సీఐ రాణి తెలిపారు. మండల పరిధిలోని శెట్టిపల్లి కలాం గ్రామానికి చెందిన ఎల్ల బోయిన భూపాల్ తన వ్యవసాయ క్షేత్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం రావడంతో సోమవారం రామయంపేట్ ఎక్సైజ్ సీఐ రాణి, ఎస్సై విజయ పార్థసారథి తన సిబ్బందితో దాడి చేశారు. గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఎల్ల బోయిన భూపాల్‌ను అదుపులోకి తీసుకొని 12 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భూపాల్‌ను తహసీల్దార్ రాజు ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి మొక్కలను పెంచినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాణి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



నవతెలంగాణ-కొల్చారం

కౌడిపల్లి 132/33 కేవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ అధికారి హమ్మద్ అలీ తెలిపారు. కొల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హమ్మద్ అలీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం పేదలకు తీరని లోటు



నవతెలంగాణ-నిజాంపేట

ప్రొఫెసర్ సాయిబాబా మరణం పేదలకు తీరని లోటని మండల మాల మహానాడు అధ్యక్షులు బండారు చంద్రయ్య అన్నారు. నిత్యం పేద ప్రజల కోసం పోరాటాలు చేసిన వ్యక్తులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జైల్లో పెట్టడం ఎంతవరకు సమంజసమని మండల మాల మహానాడు అధ్యక్షులు బండారు చంద్రయ్య ప్రశ్నించారు. ఎలాంటి తప్పు చేయని ప్రొఫెసర్ సాయిబాబాను పది సంవత్సరాలు జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. నక్సలైట్లకు ప్రొఫెసర్ సాయిబాబాకు సంబంధాలు ఉన్నాయని అంటగట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వము చొరవ తీసుకొని ఆయనకు సరియైన చికిత్స చేయించినట్లయితే బ్రతికే వారన్నారు. వారిని ప్రభుత్వము పట్టించుకోలేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామన్నారు.

దుర్గామాత లడ్డును కైవసం చేసుకున్న సాయి చరణ్



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని రంగంపేట గ్రామంలో దేవీ నవరాత్రులు సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గ భవాని లడ్డూ వేలం ఆదివారం రాత్రి నిర్వహించారు. మండలంలోని సంగాయపేట గ్రామానికి చెందిన ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నె సాయిచరణ్ రూ.69 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయిచరణ్‌ను శాలువాతో సన్మానించి మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు.

సంక్షేమ పాఠశాలల్లో పగడ్బందీగా శానిటేషన్ చేపట్టాలి

- కలెక్టరేట్ కార్యాలయంలో ఈ ఆఫీస్ విధానం
- రెండు రోజుల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
- గ్రామ సభలతో అర్హుల గుర్తింపు
- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

దసరా సెలవుల అనంతరం ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు పునః ప్రారంభమవుతున్న తరుణంలో శానిటేషన్‌పై పగడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారుల ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా అభివృద్ధి సంక్షేమంపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని, దసరా సెలవులు ముగించుకుని జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఫ్రైడే, డ్రై డేగా చేపట్టి పరిసరాల పరిశుభ్రతపై చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో పలు శాఖలకు సంబంధించిన ఫైల్స్ ఈఆఫీస్ విధానం పగడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఫైలు ఈఆఫీస్ ద్వారానే రావాలని మాన్యువల్ ఫైల్స్ చూడడం జరగదని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అకాల వర్షాల వలన కూలి పోయిన ఇండ్లకు, మొత్తంగా ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి రిజర్వేషన్ ప్రతిపాదికన వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభ పెట్టి అర్హత గల లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ కమిటీల మార్గదర్శకాలను చదవాలని సూచించారు. ఇందిరమ్మ పథకం కింద



ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను కేటాయించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో ఐదు లక్షలను ప్రభుత్వం చెల్లించనుందని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి

నవ తెలంగాణ-మెదక్ టౌన్

పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బుస్సా సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామానికి చెందిన మార్గం యాదగిరి ఇటీవల విద్యుత్ షాక్ ప్రమాదంలో మరణించాడు. ఇద్దరికీ పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చొప్పున ఇద్దరికీ రూ.4,00,000/- విలువ గల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను సత్తయ్య సతీమణి బుస్సా ముత్యాలుకు, యాదగిరి సతీమణి మార్గం లక్ష్మిలకు సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండేందుకే ప్రమాద బీమా సౌకర్యం కల్పించారన్నారు. ఇంట్లో కుటుంబ పెద్దను కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కుతో ఆర్థికంగా కొంత ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు యం. దేవేందర్ రెడ్డి, హవెలిఘనపూర్ ఘనపూర్, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, అంజ గౌడ్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యమ్ లావణ్య రెడ్డి. మెదక్ మాజీ వైసీపీ మార్గం అంజనేయులు శమ్నాపూర్ మాజీ సర్పంచ్ లింగం, మాజీ వైస్ ఎంపీపీ రాధాకిషన్ యాదవ్,



నాయకులు కిష్టయ్య, రాజు, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సతీష్ రావు, రాజేశ్వర్ రావు, యువ నాయకులు వినయ్, అనిల్, హరీష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో సందడిగా మారిన బీఆర్ఎస్ కార్యాలయం

బీఆర్ఎస్ కార్యాలయం కార్యకర్తలతో సందడిగా మారింది. దసరా పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డికి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు.

డివైడర్‌ను ఢీ కొని కారు పల్టి, ఒకరు మృతి



నవతెలంగాణ-నార్సింగి

కారును అతివేగంగా నడుపుతూ డివైడర్ ను ఢీ కొట్టడం తో కారు పల్టీ అయి ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధి జాతీయ రహదారి 44 పై వల్లూరు శివారు లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన గుర్రాల సిద్దిరాములు తన బంధువు (సడ్డకూడు) అయిన కత్తెర యాదగిరి గ్రామం అచ్చంపేట, మాసాయిపేట మండల వాస్తవ్యుడు అతని తండ్రి కత్తెర నర్సింలు (80) కు చికిత్స నిమిత్తం నార్సింగి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు సాంట్రో కారులో బయలుదేరారు. కారును కత్తెర యాదగిరి అతివేగంగా నడుపుతూ సాయంత్రం 4 గం ప్రాంతంలో వల్లూరు శివారు లోకి రాగానే అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టాడు. వేగంగా ఢీ కొట్టడం తో కారు పల్టీ అయి కారులో ప్రయాణిస్తున్న కత్తెర నర్సింలు కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షత గాత్రునికి చికిత్స నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా నార్సింగి శివారులో మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రి కి తరలించి గుర్రాల సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ వివరించారు.

విజయరామరాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం







మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మాజీ జెడ్పిటిసి విజయరామరాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్‌లో మాజీ జెడ్పిటిసి విజయరామరాజు మృతి చెందడంతో భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో మాజీ మంత్రి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్‌లు అంత్యక్రియల్లో పాలొని పాడెను మోసారు. ఎమ్మెల్సీలు షేర్ సుభాష్ రెడ్డి యాదవ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, పద్మ దేవేందర్ రెడ్డి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మురళి పంతులు. మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాయిని మధు, నారా గౌడ్, ఆర్యన్ సంతోష్ కుమార్, సంగమేశ్వర్, ఆయా గ్రామాల మాజీసర్పంచ్‌లు. ఎంపీటీసీలు. అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజల నుంచి 35 దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 35 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రైతు రుణమాఫీ-02, పింఛన్లు 01, డబుల్ బెడ్ రూం 01, ఇతర సమస్యలు16 ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలని ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి



తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఆర్టిజన్ కార్మికులు

నవ తెలంగాణ-నర్సాపూర్



విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ పట్టణంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డికి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డికి వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ టీవిఏ జేఏసీ రాష్ట్ర కమిటీ మేరకు ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులలో కన్వర్ట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీఏసీ జేఏసీ మెదక్ జిల్లా చైర్మన్ బీఎస్ స్వామి, కో చైర్మన్ నాగరాజు, కన్వీనం ఎస్.దుర్గేశ్, జాయింట్ సెక్రెటరీ సురేష్, అడ్వైజర్ ఎ.మహేందర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ జిన్నా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దాబాలో దొంగలు పడ్డారు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో గల ఎంఎన్ దాబాలో దొంగలు పడ్డారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే చెలిమేడ గ్రామానికి చెందిన మంగిలిపల్లి స్వామి గత సంవత్సరం నుంచి చల్మెడ గ్రామ శివారులో ఉన్న చల్మెడ కమాన్ వద్ద ఎంఎన్ ధాబాను నడుపుతున్నాడు. ఈ నెల 12వ తేదిన ఉదయం సుమారు 10:30 గంటలకు అతను తన దాబాకి వచ్చి దసరా పండుగ సందర్భంగా పూజ చేసిన అనంతరం 12:30 గంటలకు తన ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 09:00 గంటల సమయంలో తన దాబా వద్దకు వచ్చి చూడగా దాబాలో ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడంతో పాటు లోపలి గది తలుపు కింది భాగం పగలగొట్టి ఉందని, డోర్ తాళం కూడా పగలగొట్టి ఉండి, డాబాలోని టేబుల్ డ్రాలో ఉంచిన డబ్బు, దేవుడి ముందు ఉంచిన రెండు హుండీలు (గల్లా పెట్టె) కనబడలేదు. తన దాబాలో ఎవరూ లేని సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాబాలోకి చొరబడి లోపలి గది తలుపు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడి సుమారు రూ.10 వేలను ఎత్తుకెళ్లారని పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

నిమజ్జనం సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో నార్సింగి దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా మాత నిమజ్జనంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జనం సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 26 సం.గా నిరంతరాయంగా అందరూ ఏకతాటిపై వచ్చి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా నవరాత్రులు నిర్విఘ్నంగా జరపాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులకు లక్ష రూపాయల నగదు విరాళంగా ఇచ్చారు. అనంతరం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొత్త ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా



రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేష్ గౌడ్, తాజా మాజీ వార్డు సభ్యులు ఎండి ఫరీద్, గణేష్, జమీర్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీపతి రావు, రోమాల రాజు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ (బాబీ), నార్సింగి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధిపతి డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోదారులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి

మండల పరిధిలోని ధర్మసాగర్ గేటు వద్ద సోమవారం దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్ దాబాను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ రెస్టారెంట్ దాబా నుంచి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని వినియోగదారులకు అందించాలన్నారు. రెస్టారెంట్ ప్రొప్రైటర్ రవీందర్ ఉపాసన, పార్ట్నర్స్ అతిథులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గుంజరి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గా గౌడ్ నాయకులు



చిలుముల రాజీవ్ రెడ్డి, మైపాల్ రెడ్డి, సత్యం గౌడ్, ముత్యం రెడ్డి, కొట్టల మాజీ ఉప సర్పంచ్ మాధవ రెడ్డి, బిక్షపతి నాయకులు పోల నవీన్ కుమార్, సందీప్ కుమార్, బెస్త అనిల్ కుమార్, గొల్ల రవి యాదవ్, జీవన్ గౌడ్, దన్ను రెస్టారెంట్ ప్రొప్రైటర్స్ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి కొడుకు అదృశ్యం కథ సుఖాంతం

నవతెలంగాణ-నార్సింగి





కుటుంబ కలహాలతో దసరా పర్వదినాన తల్లి, కుమారుడు అదృశ్యమై అందరికీ ఆవేదనకు గురి చేసి రెండు రోజుల అనంతరం వారు దొరకడంతో సుఖాంతమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల బాబుకు అదే గ్రామానికి చెందిన జ్యోతితో పదిహేను సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి సుష్మా (11), కుమారుడు సాత్విక్ (6) సంతానం. అయితే గత కొద్ది సంవత్సరాలుగా చెప్యాల బాబు తల్లి దండ్రులు కూతురు సుష్మా తో పాటు మేడ్చల్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుండగా, బాబు తన భార్య కొడుకు సాత్విక్‌తో పాటు పెయింటింగ్ పనులు చేస్తూ శేరిపల్లి లో నివాసం ఉంటున్నాడు. ఇదిలాఉండగా 12న దసరా పండుగ రోజున భార్య జ్యోతితో కుటుంబ నేపథ్యంలో గొడవ జరగగా, అతను దసరా వేడుకలను చూడడానికి ఇంట్లో నుంచి ఊర్లోకి వెళ్ళాడు. అనంతరం ఇంటికి వచ్చి చూడగా జ్యోతి, సాత్విక్‌లు కనబడలేదు. అదే గ్రామంలో ఉన్న జ్యోతి తల్లిగారింటికి వెళ్లిందని భావించి అక్కడకు వెళ్లి చూడగా అక్కడికి రాలేదని తెలిసి చుట్టూ పక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా వారి ఆచూకీ లభించలేదు. ఈ విషయమై నార్సింగి పోలీస్ స్టేషన్ లో బాబు ఫిర్యాదు చేశాడని, తాము కేసు నమోదు చేసి తల్లి కొడుకు ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు. జ్యోతి ఫోన్‌ను ట్రేస్ చేయగా, అప్పటి వరకు స్విచ్ ఆఫ్ వచ్చిన ఫోన్ సోమవారం 14న ఉదయం జ్యోతి ఫోన్ స్విచ్ ఆన్ చేయగానే ట్రేస్ అయ్యిందని, ఆమె లోకేషన్ శంకరం పేట్ మండలం కొరివిపల్లి గ్రామంలో ఉన్నట్లు తెలిపిందన్నారు. జ్యోతి కోరివిపల్లి గ్రామంలోని తన మేనమామ ఇంట్లో ఉన్నట్లు అక్కడికి చేరుకున్న పోలీసులు తెలుసుకుని, జ్యోతి, సాత్విక్‌లను కుటుంబ సభ్యులకు అప్ప చెప్పామని తెలిపారు. మొత్తానికి పండుగ రోజున ఇంట్లో నుంచి వెళ్లిన తల్లి కొడుకు కథ సుఖాంతమవడంతో బాబు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పోలీసులను అభినందించారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

పోతాన్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ - తూప్రాన్

పోతాన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజు రెడ్డి ని సోమవారం రోజున కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కవ్వం మాధవరెడ్డి,మాజీ సర్పంచ్ గోకని జగన్ గౌడ్, సీనియర్ నాయకులు బలిజ భూమలింగం, పోతాన్ శెట్టిపల్లి గ్రామ అధ్యక్షులు సందీప్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

- ప్రొఫెసర్ అంత్యక్రియల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని హుస్నాబాద్ నియోజకవర్గం జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాదులోని సాయిబాబా ఇంటి వద్ద ఆయన మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 90 శాతం వైకల్యంతో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను అండాసెల్ జైల్లో ఉంచి అనేక రకాలుగా చిత్రహింసలకు గురిచేసి చంపారని ఆరోపించారు. చివరకు నిర్దోషి గా ప్రకటించి విడుదల చేసిన 7నెలల్లోనే మరణించడం బాధాకరం అన్నారు. సాయిబాబా మరణం కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేసిన హత్యేనని, సాయిబాబా మరణం పీడిత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, కో కన్వీనర్ కోహెడ కొమురయ్య, అంబేద్కర్ సంఘము రాష్ట్ర నాయకులు బత్తుల చంద్రమౌళి, తాళ్లపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రోగ్రాం ఆఫీసర్ మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డాక్టర్ ఆనంద్ ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దావఖాన, వెల్నెస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారితో పాటు అందరూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, విధులు నిర్వహించాలని సూచించారు. వెల్నెస్ సెంటర్లో ఉన్న రికార్డులను, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. నెలవారీగా వెల్నెస్ సెంటర్లో చికిత్స పొందుతున్న ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్ల వివరాలను, ఫిజియోథెరపీ వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ సెంటర్ వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీవీఏసీ జేఏసీ

- జిల్లా నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ పోస్టుల్లో కన్వర్షన్ ఇవ్వాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందించినట్లు టీవీఏసీ జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రిని కలిసి ఆర్టిజన్ కార్మికులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి ఆర్టిజన్ కార్మికుల సమస్యను సీఎం విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సిద్దిపేట జిల్లా చైర్మెన్ గుంటిపల్లి సధాకర్, కో చైర్మన్ కనకరాజు, కోకన్వీనర్ సందీప్, జిల్లా నాయకులు భూపతి రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. సోమవారం దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట మండలం రుద్రారం గ్రామం బీఆర్ఎస్ కార్యకర్త మిద్దె అశోక్ తల్లి బాలమని మరణించిన విషయం ఆయన తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించినారు. ఎస్సీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ప్రరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు జీడిపల్లి రవి, కనకయ్య, రాజమౌళి, సూకురి లింగం, పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్‌లు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సిద్దిపేటలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జంబి ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-సిద్దిపేట

అపూర్వ విద్యార్థుల సమ్మే ళనానికి సిద్దిపేట శుభోదయం విద్యాలయం వేదికైంది. ఆ పాఠశాలలో 2000-2001 చదువుకున్న పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం కన్నుల పండుగగా జరిగింది. 23 ఏండ్ల క్రితం చదువులమ్మ ఒడిలో అక్షరాలు దిద్దిన విద్యార్థులు ఏకం కావడంతో ఉబ్బితబ్బుయ్యారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుశల ప్రశ్నలు వేసుకున్నారు. చదువుకున్న నాటి రోజులను నెమరు వేసుకొని, ఈ సందర్భంగా చదువుల్లో ఉత్తమంగా రాణిస్తున్న పేద విద్యార్థులకు బాసటగా నిలవాలని ప్రతిన పూనారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఎజాస్ అహ్మద్, దేశపతి శ్రీనివాస్ శర్మ, బాపురెడ్డి, చరణ్, దుర్గయ్య, విదుమౌళి, పద్మయ్య, విద్యార్థులు శివ, రంజిత్, పెద్దిఎల్లోహర్, చందు, మధు పాల్గొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్ళి వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్గల్

స్నానానికి వెళ్ళి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తునికి మక్త గ్రామంలో సోమవారం రోజున వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుండు రాములు (58) ఆదివారం వారి దాయాదుల దశదిన కర్మ సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి గ్రామ సమీపంలోని హంసోని కుంటలోనికి స్నానం కోసం వెళ్లారు. రాములు ప్రమాదవశాత్తు నీటిలో పడి కనిపించలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం రాములు మృతదేహం చెరువులో తేలుతూ కనిపించింది. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని వెలికట్ట గ్రామానికి చెందిన ఎర్రబోయిన నర్సింలు, కెమ్మసారం జ్యోతికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు కొండపాక మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసరీ లింగా రావు అందచేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు వరం లాంటిదని ఈ సంద ర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుగు తిరుపతి, సిద్ధులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి దుర్మరణం



(ఫైల్)

నవతెలంగాణ-దుబ్బాక

బంధువుల ఇంట్లో సంవత్సరికానికని వెళ్తూ.. మార్గమధ్యం లో మురుగు కాలువలో పడి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన పూస శంకర్ (55) చిరు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 13 న దుంపలపల్లి వార్డులో బంధువుల సంవత్సరీకానికి ఇంట్లోంచి బయలుదేరిన శంకర్ రాత్రయినా రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దుబ్బాకలోని టీటీడీ కళ్యాణమండపం దగ్గరలో మురుగు కాలువలో పడి శంకర్ చనిపోయినట్లు ఈనెల 14 న సమీప బంధువైన పూస స్వామి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మృతుడి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూత్ర విసర్జన చేస్తూ ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి మృతి చెందాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ పదవి ఇచ్చినందుకు సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

జనగామ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవిని యాదవ కులానికి చెందిన బనక శివరాజ్ యాదవ్‌కు ఇచ్చినందుకు కృతజ్ఞతగా జనగామ డీసీసీ అధ్యక్షులు నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని, జనగామ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, జనగామ మార్కెట్ కమిటీ చైర్మెన్ బనుక శివరాజ్ యాదవ్‌లను జనగామ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జేల్లా శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్ గౌడ్, సాగర్ గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, భాను, నాగులపల్లి సచిన్ యాదవ్, దూల్మిట , మద్దూరు, మండల యూత్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి












- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్, మిరుదొడ్డి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో, మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, ఏపీడీ మధుసుధన్, డీపీఎం రాజయ్య, ఏపీఎం కృష్ణ రెడ్డి, ఎంపీడీఓ భాస్కరశర్మ, ఎమ్మార్వో నల్లా వెంకట్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గం, మండలంలోని అప్పనపల్లిలోని 90 శాతం రైతులు వ్యవసాయధారిత పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని , కొనుగోలు కేంద్రాల్లోకి రైతులకు తీసుకొచ్చే ధాన్యానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, రవాణాకు అవసరమయ్యే లారీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2320, బీ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2300లు కేటాయించిందన్నారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి ప్రభుత్వ గిట్టుబాటు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మల్లన్న సాగర్ కెనాల్ ద్వారా దుబ్బాక నియోజకవర్గానికి సాగునీరు అందించడంతో ఈ ప్రాంత రైతులు అదనంగా 40శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రారంభోత్సవానికి పోలీసులు భారీగా మొహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పోషాద్రి, మాజీ ఎంపీటీసీ లావణ్య యాదగిరి, సీసీలు భాగ్యలక్ష్మి, పర్శరాములు, వీవోఏ సత్యపాల్, ఏపీఎం డాకయ్య, సీసీ ప్రభాకర్, వివోఏలు సత్తిరెడ్డి పద్మ ఐకేపీ సిబ్బంది, రైతులు బీఆర్ఎస్ నాయకులున్నారు.

బెజ్జంకి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మద్ధతు ధరతో వరిధాన్యం కొనుగోళ్లు చేపట్టిందని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు తోటపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుల యందు పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ, పీఏసీఎస్ చైర్మెన్ తన్నీరు శరత్‌రావుతో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ రెడ్డి, ఒగ్గు దామోదర్, ఏఎంసీ, పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు, రైతులు హజరయ్యారు.

కొండపాక : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలం రాంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీఆర్‌డీఓ జయదేవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సౌలభ్యం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నాడు. రైతులు పండించిన ధాన్యాన్ని అరబెట్టుకుని శుద్ధి చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, ఏపీఎం మగ్దుమ్ అలీ, రైతులు, గ్రామ సంఘం మహిళలు పాల్గొన్నారు.

మద్దూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాన్యం విక్రయించుకోని, అధిక లాభాలు పొందాలని కోరారు. రైతులు దళాలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, జిల్లా నాయకులు జెక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, ఏపీఎం బాబురావు, ఏఓ రామకృష్ణ, మహిళా సంఘాలు, పాల్గొన్నారు.

నంగునూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలను గ్రామ, గ్రామాన ఏర్పాటు చేసి మద్దతు ధర అందిస్తుందని ఐకేపీ ఏపీఎం మహిపాల్ అన్నారు. సోమవారం నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేందాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాగుల సారయ్య, సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, ఏవో గీత, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, లింగం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట శంకర్, పాల్గొన్నారు.

మర్కుక్: మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు రూ. 500 బోనస్ ప్రకటించడం హర్షించ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజు, మాజీ సర్పంచ్ మొండి భాగ్య బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి, సీసీ కవిత, ఏఈవోలు రజినీకాంత్, విష్ణువర్ధన్, మహిళా సంఘాల సభ్యులు బాలమణి, కవిత, సంతోష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య, ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, యూత్ అధ్యక్షులు గుర్రాల నర్సింలు, నాయకులు, తదితరులున్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో రైతు వేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ సోమవారం ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతు పండించిన ప్రతి గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దళారీ వ్యవస్థను తావు లేకుండా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు, ఆర్ఐ సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, యాదగిరి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రామా గౌడ్, ఏపీఎం దుర్గాప్రసాద్, సెక్రటరీ కుమారస్వామి, సీసీ పుష్పలత, ఎఫ్‌పిసి రవీందర్ చారి, కరుణాకర్, నాయకులు, పాల్గొన్నారు.

హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తాహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఏవో నాగరాజు, ఏపీఎం జి .శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు బంక చందు, మాజీ సర్పంచ్ బత్తిని సాయిలు, ఏఈఓ విజయ్, సీసీలు రవీందర్ , అశోక్, బిక్షపతి, శివ చరణ్ సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగదేవపూర్: మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో డీఆర్‌డీఏ - సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్ మార్కెట్ కమిటి చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, ఏపీఎం కిరణ్ కుమార్, గ్రామ సంఘం అధ్యక్షురాలు రేణుకలతో కలిసి వడ్ల కొనుగోలు కేంద్రం ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతుల ప్రభుత్వం అని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు వర్షాలకు రక్షించుకొని కొనుగోలు కేంద్రంలో అమ్మి గిట్టుబాటు ధర పొందాలని అన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేషిరెడ్డి రవీందర్ రెడ్డి, సీనియర్ జిల్లా నాయకులు హన్మంత రెడ్డి, కొండపోచమ్మ టెంపుల్ మజీ చైర్మెన్ మల్లేశం, గ్రామ పెద్దలు జనార్ధన్ రెడ్డి, నర్సింలు మాజీ ఎంపీటీసీ రైతులు, ఏవో, ఎంపీవో, ఏఈవో, పంచాయతీ కార్యదర్శి సీసీలు దేవరాజ్, రమేష్ రెడ్డి, రవి , గ్రామ సంగం కార్యదర్శి కళ్యాణి, వివోఏ సుదర్శన్, పాల్గొన్నారు.

కుల,మతాలు, మూఢనమ్మకాలు లేని సమాజ స్థాపనే సీపీఐ(ఎం) లక్ష్యం


- శాస్త్రీయ విజ్ఞానంతో అవకాశాలను పొందుతూ జీవించాలి
- సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో



నవతెలంగాణ-చేర్యాల

కుల, మతాలు, ధనిక, పేద, మూఢనమ్మకాలు లేని సమాజ స్థాపనే సీపీఐ(ఎం) లక్ష్యమని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో అన్నారు. మండల పరిధిలోని గుర్జకుంట గ్రామంలో సోమవారం ఆ గ్రామ సీపీఐ(ఎం) మహాసభ దర్శనం రమేష్ అధ్యక్షతన జరిగింది. పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు కాశెట్టి ఆంజనేయులు ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా వెంకట మావో హాజరై మాట్లాడుతూ.. మనుషులంతా సుఖ సంతోషాలతో శాస్త్రీయ విజ్ఞానంతో అన్ని అవకాశాలను పొందుతూ జీవించాలని కోరుకునేది సీపీఐ(ఎం) సిద్ధాంతమని తెలిపారు. నేడు గ్రామాల్లో కుల, మతాల పట్టింపులు విచ్చలవిడిగా పాటిస్తూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పట్టించుకోకుండా నేటి యువత పక్కదోవ పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పట్ల శాస్త్రీయ విజ్ఞానంతో సీపీఐ(ఎం) భావాలను ఆచరిస్తూ అంతరాలు లేని సమసమాజ నిర్మాణానికి నాంది కావాలని అన్నారు. నేడు ప్రభుత్వాలు బూర్జువా దోపిడీ వ్యవస్థను సమర్థిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని, కార్మిక, కర్షకుల జీవితాల్లో మార్పు కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, అందుకోసం పార్టీ నిర్వహించే పోరాటాలకు గ్రామ ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించి పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ(ఎం) గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా శనిగరం కిష్టయ్య, సోషల్ మీడియా ఇంచార్జిగా శనిగరం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్, శెట్టె కిష్టయ్య బొప్పెనపల్లి ఎల్లయ్య, రామయ్య, దర్శనం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో మార్పు



నవతెలంగాణ-సిద్దిపేట

మంచి మాటలు, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు తేవచ్చని ప్రముఖ కవి, అవధాన విద్య పీఠం అధ్యక్షులు మారుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. సోమవారం వ్యాస మహర్షి యోగ కేంద్రం సిద్దిపేటలో శ్రీయశస్విని గ్రంథ పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పద్యం ప్రాచీనమైన ప్రక్రియ అయినా పద్యం నిత్య నూతనంగా ఉత్తేజితంగా సమాజానికి చేరుతుందన్నారు. 180 మంది కవులతో ఏక మకుటంతో 1800 పైగా పద్యాలు చదివే అవకాశం శ్రీయశస్విని గ్రంధం ద్వారా చదివే అవకాశం ఉండడం సంతోషమన్నారు. రససిద్ధి అయినా ప్రసిద్ధిపేటలో సాహిత్యంనకు కొదవ లేదన్నారు. అవధానులకు పేరు తెచ్చినది సిద్దిపేట ప్రాంతమన్నారు. కవులకు, కళాకారులకు పుట్టినిల్లు సిద్దిపేట అన్నారు. కరోనా సమయంలో కూడా రచనలతో చేతన్యం తెచ్చినది సాహిత్యమన్నారు. పుస్తక సంపాదకులు, అవధాని డాక్టర్ ఓమ్ ప్రకాష్ మాట్లాడుతూ.. శ్రీ యశస్విని గ్రంధంలోని ప్రతి పద్యం జన జీవనంలోని అంశాలు గుర్తుచేస్తాయన్నారు. పద్య మననం ద్వారా ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి, రచయితలు ఉండ్రాళ్ళ రాజేశం, సాయిప్రసాద్, ఎన్నవెల్లి రాజమౌళి, తోట సతీష్, బస్వ రాజ్ కుమార్, జబర్దస్త్ లక్ష్మీకిరణ్, సింగితం నరసింహరావు, వరుకోలు లక్ష్మయ్య, డాక్టర్ సుధాకర్, మురళీదరశర్మ, రామకృష్ణ, మాధవిలత, బేజుగామ శ్రీజ, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ జాతీయ సదస్సు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-వర్గల్

ఈనెల 27వ తేదీన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించబోయే స్వేరోస్ జాతీయ సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్గల్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కిష్టనోళ్ల స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వేరోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో గత 12 ఏండ్లుగా అనన్య సామాన్యమైన కార్యక్రమాలతో స్వేరోస్ నెట్వర్క్ పనిచేస్తుందని గురుకులాల అడ్మిషన్స్ లోనూ అగ్రగామిగా నిలపడంలో స్వేరోస్ నెట్వర్క్ పాత్ర ముఖ్యమైంది అన్నారు. ఈ సందర్భంలో స్వేరోస్ పైలాన్ కూడా ఆవిష్కరించుకోవడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి స్వేరోస్ నెట్వర్క్ అందించిన వ్యాపారవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, వస్తారని భవిష్యత్తు ఆర్థిక మూలాల మీద నిర్మితమైంది కాబట్టి స్వేరోసు ఆర్థిక మూలాల మీద అవగాహన సదస్సు ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి స్వేరో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ జుట్టు రాజు, కిష్టనోళ్ల సురేష్, కొమ్ము పరుశు రాములు, బాగనోళ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు



నవతెలంగాణ-చేర్యాల

పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబాను మతోన్మాద మోడీ ప్రభుత్వం ఏడేళ్లకు పైగా మహారాష్ట్ర జైలులో నిర్బంధించిందన్నారు. 90 శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాకు కనీసం వైద్య సదుపాయం కూడా కల్పించకుండా మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సాయిబాబా మృతికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దోపిడి వ్యవస్థ నిర్మూలనకై నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కొరకు, మతోన్మాద పాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే కామ్రేడ్ సాయిబాబాకి నిజమైన నివాళి అర్పించిన వాళ్ళమౌతామని అన్నారు. అశోక్ వెంట సీపీఐ నాయకులు ఈరి భూమయ్య, గూడెపు సుదర్శన్, గజ్జల సురేందర్ ఉన్నారు.

మాలల హక్కుల సాధనకై పాదయాత్ర జయప్రదం చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర పొలిటికల్ చైర్మన్ శ్రీరాములు



నవతెలంగాణ-మిరుదొడ్డి

మాలల హక్కుల సాధనకై ప్రారంభించే పాదయాత్రకు ప్రతి ఒక్కరు సహకరించాలని మాల మహానాడు రాష్ట్ర పొలిటికల్ చైర్మెన్ శ్రీరాములు అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం నుంచి 1000 కిలోమీటర్లు హైదరాబాద్ రవీంద్ర భారతికి పాదయాత్రగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ యొక్క పాదయాత్రకు ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఒక్కరు మాలలు సహకరించాలని కోరారు. మాల హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణను నిర్మూలించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈనెల 25 నుంచి నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దరస్వామి చంద్రం రాజు జీడిపల్లి రమేష్ రాగం కనకయ్య లక్ష్మణ్ కరిక పరశురాములు రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 15 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సమీకృత జిల్లా కార్యాలయాంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి అర్జిదారులు అదనపు కలెక్టర్‌కి దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమం సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవడానికి ఒక చక్కని వేదిక ఈ ప్రజావాణి. సమస్యలు పట్టుకుని ఎంతో నమ్మకంతో కార్యాలయం కి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయ్యాలని జిల్లా అధికారులకు తెలిపారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 29 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ , డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని గెలిచినవారికి అహంకారం ఉండకూడదని, ఓడినవారు కృంగిపోకూడదని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్, బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు రహీముద్దీన్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో నర్రా రాజేందర్ యువసేన ఆధ్వర్యంలో క్రీడా పోటీల ముగింపులో పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారులు ఎంతో ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. బతుకమ్మ దసరా దీపావళి పండుగల సందర్భంగా ప్రతి ఏటా క్రీడ పోటీలు నిర్వహిస్తున్న ఎస్ఆర్ సేన వ్యవస్థాపకులు నర్ర రాజేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్ర సత్యం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సల్ల స్వామి, నాయకులు రాజు, ప్రశాంత్, సురేష్, శ్రీకాంత్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దర్శించుకున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నవతెలంగాణ-కొమురవెల్లి



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్ అరికెపూడి గాంధీ సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామి వారి చిత్రపటంతో పాటు, శేష వస్త్రం, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహదేవని శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు పడిగన్న గారి ఆంజనేయులు, మహదేవుని సాంబయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింలు గౌడ్, తదితరులు పాల్గొన్నారు

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి అదృశ్యం అయినట్లు మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరి గత కొద్ది కాలంగా మద్యానికి బానిసై రోజు ఇంట్లో గొడవ పడుతూ ఉండేవాడని. ఈనెల 13న ఎందుకు ప్రతిరోజు తాగి వస్తున్నావు అని తన భార్య లక్ష్మి అడగగా తనతో గొడవ పెట్టుకొని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు యాదగిరి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు .

టీపీసీసీ అధ్యక్షులను కలిసిన సాకి ఆనంద్

నవతెలంగాణ-సిద్దిపేట



తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానం చేసినట్లు కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్ తెలిపారు. నిజామాబాద్‌లో ఆనాటి పాలిటెక్నిక్ కాలేజీ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, చాలా ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు.

దళితుల అభివృద్ధికి సీఎం కృషి

నవతెలంగాణ-గజ్వేల్



దళితుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో దళిత బంధు పెట్టి కార్యకర్తలకు ఇచ్చుకున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇల్లు లేని పేదలను గుర్తించి ప్రభుత్వం అందజేస్తున్న అన్నారు. రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిం చినట్లు గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు ఏడాది కాలంలో అమలు చేయడంతో ప్రభుత్వం ప్రజాభిమానం పొందుతుందన్నారు. ఇది చూసిన గత ప్రభుత్వం పెద్దలు ఓర్వలేక పోతున్నారన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గజ్వేల్ అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలోని అంతకపేట గ్రామంలో సేర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ రామ్మూర్తి డిఎస్ఓ తనూజ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, ఏవో నాగరాజు ఏపీఎం జి .శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, కొయ్యడ సృజన్ కుమార్, ఏఈఓ, సీసీలు తిరుపతి, బిక్షపతి, శివ చరణ్ సింగ్, రాజు వివో అధ్యక్షులు మమత, విఓఏలు మంగాదేవి, అంజలి, గ్రామైక్య అధ్యక్షురాలు తిరుమల, రేణుక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మద్దూరి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బయ్యారం మాజీ సర్పంచ్ మద్దూరు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. మండలంలోని వివిధ గ్రామాల చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై శాలువలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లేశం, మాజీ సర్పంచ్ దివ్య దయాకర్ రెడ్డి, హైదర్ ఇక్బాల్, బీఆర్ఎస్ మండల నాయకులు మోహన్ బాబు, కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, వినయ్ రెడ్డి, సాయి, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి

సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి

నవతెలంగాణ-గజ్వేల్



సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని బీఆర్ఎస్ గజ్వేల్ సీనియర్ నాయకులు కళ్యాణ్ కార్ నర్సింగారావు అన్నారు. సోమవారం తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దగ్గరికి వస్తుందని ఇచ్చిన 6 గ్యారంటీలో బస్సు ప్రయాణం మినహా మిగతా పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు అన్నారు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో అనుగుణంగా బస్సులు కేటాయించకపోవడంతో రద్దీ ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపోకు మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలని అదేవిధంగా బస్టాండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అంతేకాకుండా వృద్ధులకు వికలాంగులకు పింఛన్ రూ.4 వేలు వెంటనే పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



దివంగత రతన్ టాటా దేశానికి ఎంతో సేవ చేశాడని ఆయనకు భారతరత్న ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అనేక సంస్థలు నెలకొల్పి కంపెనీలు పెట్టి ఎలాంటి లాభాపేక్షా లేకుండా సమాజసేవ కోసం అనేక మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించాడన్నారు. దేశం కరోనాతో పోరాడుతుంటే వందల కోట్లు సహాయం చేశారన్నారు. ఒకవేళ నా దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే రూ.1500 కోట్లు కాదు నా ఆస్తి మొత్తం నాదేశం కోసం ఇస్తానని ప్రకటించిన మహా వ్యక్తి అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తికి రతన్ టాటాకు అత్యున్నత పురస్కారం తో గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు.

మల్లన్న సాగర్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మున్సిపల్ పరిధిలో నివాస ముంటున్న మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపా యాలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్య క్షులు బండ్ల స్వామి అన్నారు. సోమవారం ఆయన ఇంటిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఊరు, వాడ, వ్యవసాయం వదిలి ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులను గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో నిర్వాసితులకు కాలనీ ఏర్పాటు చేసి అందులో వదిలి పెట్టారని అన్నారు. నిర్వాసితుల కాలనీలో కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. 8 గ్రామాలు, ఆరు మధురే గ్రామాలు, పదివేల 500 వందల జనాభా నివాసముంటున్న మల్లన్న సాగర్ కాలనీకి కనీసం స్మశాన వాటిక లేకపోయిందన్నారు. కాలనీలో కాలం చేసిన వారిని అక్కడున్న గుట్టల్లో దహనం చేస్తున్నారని ఆవేదన చెందారు. ఎన్నికల్లో నిర్వాసితులకు అన్ని హామీలు నెరవేస్తామని అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఏడాది కాలంగా నిర్వాసితులను పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసితులు నివాసముం టున్న గ్రామాలకు బస్సులు రావడం లేదన్నారు. వెంటనే మల్లన్న సాగర్లో బస్టాండ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉదయం, సాయంత్రం, రాత్రి నిర్వాసితుల కాలనీకి బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలపై సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, గజ్వేల్ ఎమ్మెల్యే మాజీ సీఎం కేసీఆర్, పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, అధికార కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షు లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఈ విషయంలో స్పందించాలన్నారు. మల్లన్న సాగర్ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాలను సమకూర్చా లని ఆయన డిమాండ్ చేశారు.

పెండింగ్ ఫీజ్ రియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి





నవతెలంగాణ-సిద్దిపేట

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియాంబర్స్ మెంట్ డబ్బులను విడుదల చేయాలనీ, ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వచ్చే ఫీజు రియాంబర్స్ మెంట్ రాక విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు పడుతున్నాయని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకటి నవీన్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరిలు అన్నారు. సోమవారం సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిధులను విడుదల చేయలి లేని పక్షాన కళాశాలలు నిర్వహించిన నిరవధిక బంద్‌కు మా మద్దతు ప్రకటిస్తున్నామని, రేపటి నుంచి విద్యార్థుల, కళాశాలల పక్షాన పోరాటం చేపడతాము అని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారుగా 816 డిగ్రీ కళాశాలలు ప్రైవేట్‌లో నడుస్తున్నాయని, వాటికీ పెండింగ్ లో ఉన్న సుమారుగా రూ.750 కోట్ల ప్రభుత్వం నుంచి బకాయలు రావాల్సిన ఉన్నాయని, కానీ ఉద్దేశపూర్వకంగా వాటిని ఇవ్వకుండా 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెలగాటం ఆడుతున్నాడనీ అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ ఫీజ్ రియాంబర్స్ మెంట్ చెల్లెంపులకు ఎక్కడ ఇబ్బంది కలగలేదనీ అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న నిధులని విడుదల చేసి, విద్యార్థులను, కళాశాలలను కాపాడుకోవాలి అని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు పయ్యావుల శ్యామ్ యాదవ్, నాయకులు రాజు, రమేష్, సాయి, కమల్ పాల్గొన్నారు

నవతెలంగాణ-గజ్వేల్: పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని కోరుతూ డిగ్రీ, పీజీ కళాశాలలా యజమాన్యాలు నిర్వహిస్తున్న బంద్‌కు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి తెలిపారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను అనేక పథకాల ఖర్చు చేస్తున్న విద్యార్థులకు మాత్రం స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఎందుకు విడుదల చేయట్లే అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో యు ఎస్ ఎఫ్ నాయకులు మధు, శేఖర్, రాకేష్, రవి, రాజేష్, రవితేజ, పాల్గొన్నారు.

ప్రజలు ఐక్యమత్యం తో జక్కపూర్ అభివృద్ధికి సహకరించాలి

- కుల మతాలతో కాదు అభివృద్ధికి పోటీపడాలి
- సమస్య వస్తే 100 కాల్ చేయాలి
- ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



ప్రజల ఐక్యమత్యంతో జక్కాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఏసీపీ మధు అన్నారు. సోమవారం చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కాపూర్ గ్రామంలో కుల పెద్దలతో, గ్రామ ప్రజలతో, ప్రజా ప్రతినిధులతో ఆయన, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతి, మతం, కులం, వర్గం అనే బేధాలు లేకుండా అందరూ కలిసి మెలిసిగా ఉండడం చాలా ముఖ్యమని తెలిపారు. గ్రామంలో చిన్న చిన్న సంఘటన జరిగినప్పుడు అందరూ కలసి ఐక్యమత్యంగా ఉంటూ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరో చెప్పుడు మాటలు విని ఐక్యమత్యాన్ని చెడగొట్ట వద్దని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం తప్పకుండా ఉంటుందన్నారు. అనుకోకుండా అకస్మాత్తుగా ఏదైనా సంఘటన జరిగితే కుల పెద్దలు ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించే విధంగా పలు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియపరచాలని సూచించారు. అన్ని మతాలను కులాలను గౌరవించుకుంటూ సమాజంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యమని తెలిపారు. యువతతో తల్లిదండ్రులు పెద్దలు కమ్యూనికేషన్ సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. యువత ఉన్నతనమైన ఆలోచన పెంచుకోవాలి. ఇతర మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా పోస్టులు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అట్లాంటివి కుల పెద్దలైన మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియపరచాలని సూచించారు. ఏ సమస్య ఉన్న డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూర్, ఎస్సై బాలకృష్ణ, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, గ్రామ పెద్దలు ప్రజలు ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాలు, నాయకులు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో రసాభస

నవతెలంగాణ-రాయపోల్





రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందా పూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కరువు కాటకాలకు నిలయమైన దుబ్బాక నియోజకవర్గం నేడు పంటలకు నిలయంగా మారిందన్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రం ప్రారంభంలో బీఆర్ఎస్ నాయకులు కొబ్బరికాయ కొట్టగా కాంగ్రెస్ నాయకులు అడ్డుపడి ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..పదవీకాలం పూర్తయిన పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టడం ఏంటని మండిపడ్డారు. ఇటీవల దుబ్బాకలో చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కళ్యాణ లక్ష్మి చెక్ ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటో కాల్ ఉల్లంఘించారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పుడు ప్రోటోకాల్ గుర్తుకు రాలేదా అన్నారు. ఈ అంశంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసు లు కలుగజేసుకొని ఇరు పార్టీల నాయకులను శాంతింప చేయడం తో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడి మధుసూదన్, డీపీఎం రాజయ్య, ఏపీఎం యాదగిరి, తహసీల్దార్ చంద్ర శేఖర్ రావు, వెంకట లక్ష్మమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రహీముద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పడాల రాములు, ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శి, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు

ఎర్రోళ్ల మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నాయకులు

నవతెలంగాణ-తొగుట



ఎర్రోళ్ల మల్లయ్య మృతి చెందడం బాధాకరమని ఎంపీటీసీ కంకణాల నర్సింలు అన్నారు. సోమవారం మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మల్లయ్య అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మృతదేహానికి నివాలర్పించారు. కుటంబ సభ్యులను పరామర్శించి, రూ. 3 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు కత్తుల రమేష్, కళ్లెపు భాస్కర్, బిజనబోయిన ప్రశాంత్, పులి గారి ఎల్లం, టంకరి రాములు, పంది నర్సింలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

మండలంలోని వెంకట్రావుపేట గ్రామనికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ఎర్రోళ్ల అర్జున్ తండ్రి మల్లయ్య (80) మరణం బాధాకరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, విచారం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మల్లయ్య మరణించగా ఆయన మృతదేహనికి నివాళి అర్పించారు. అర్జున్‌ను ఓదార్చి తమ వంతుగా రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం అందించాలని కోరుకున్నారు. పరామర్శించిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, నాయకులు బండారు స్వామి గౌడ్, సుతారి రాములు, ఈదుగళ్ల పర్శరాములు, పొత్కుల స్వామి, ఎర్రోళ్ల చంద్రం, కల్లెపు నరేష్, పులిగారి నర్సింలు రాంబాబు, స్వామి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



రుణమాఫీ లేదు రైతు భరోసా జాడలేదు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

రుణమాఫీ పూర్తి కాలేదు, రైతు భరోసా జాడలేదు, రైతును రాజును చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుం దని, రైతు హితమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువుతో విలవిల లాడిన దుబ్బాక నియోజకవర్గంలో గోదావరి జలాలు పారిం చి సస్యశ్యామలం చేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతు ది.ఎక్కడో ఉన్న గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ద్వారా నీళ్లు నిలువ చేసుకోవడం జరిగిందన్నారు. రైతుకు 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా అందించి ఆదుకోవడం జరిగిందన్నారు. కరువు కాటకాలకు నిలయమైన దుబ్బాక నియోజకవర్గం నేడు పంటలకు నిలయంగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లాలోనే వరిధాన్యం ఉత్పత్తిలో దుబ్బాక నియోజకవ ర్గం ముందు వరుసలో నిలు స్తుంది. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇవ్వలేదని, ఆసరా ఫించిన్ రూ 4 వేలకు పెంచలేదన్నారు. వారు ఇచ్చిన హామీలను అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ మధుసూదన్, డీపీఎం రాజయ్య,తహసిల్దార్ దివ్య, ఎంపీడీవో బాలయ్య, ఏపీఎం కిషన్, ఏవో నరేష్,ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ భాను ప్రకాష్, సిసిలు కిష్టయ్య,రాజేశ్వర్ రావు, పంచా యితీ కార్యదర్శి శివ కుమార్, ఏఈవో రజిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, పాల్గొన్నారు.

పాలకులు ఎందరు మారినా, మారని పేదల బతుకులు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్



నవతెలంగాణ-కొమురవెల్లి

దేశంలో పాలకులు ఏందరు మారిన పేదల బతుకులు మారడం లేదని కేవలం ఎర్ర జెండా పోరాటలా ద్వారా మాత్రమే పేదల బతుకులు మారతాయని సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. సోమవారం మండలం లెనిన్ నగర్‌లో గ్రామ శాఖ మహాసభలు దాసరి బాలస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు శశిధర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి దేశంలో, రాష్ట్రంలో అనేకమంది పాలకులు పార్టీలు మారాయని కానీ పేదలను కష్టాల నుంచి విముక్తి చేసిన వారు ఎవరు లేరని పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా మారారు తప్ప పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నది కేవలం ఎర్ర జెండా మాత్రమేనని అన్నారు. కష్టజీవులకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలిచేది కమ్యూనిస్టులే నన్నారు. దేశంలో కష్టజీవుల రాజ్యం వచ్చే వరకు ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, నాయకులు దాసరి మంజుల, రాజు, దాసరి మేఘమాల, హరిబాబు, వర్షిత్ లక్ష్మయ్య పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకులు మమ్ములను అడ్డుకోవడం ఏమిటి..?

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.

నవతెలంగాణ-తొగుట



ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు మమ్ములను అడ్డుకుంటా మనడం ఏమిటని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో 80 శాతం కుటుంబాలు వ్యవసాయమే జీవనదరంగా బతుకుతున్నారని అన్నారు. నాడు ఎడారిని తలపించిన నియోజకవర్గం నేడు పచ్చని పంటలతో ధాన్యగారంగా మారిందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇన్ని హామీలు ఇచ్చి అమలు చేయలేని మీరు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను, నాయకులను అడ్డుకోవాలనడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు, రైతు బంధు రాలేదు, కళ్యాణలక్ష్మి, శది ముబారక్ పథకంలో ఆడబిడ్డలకు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. రైతు బంధు రాలేదని, రుణ మాఫీ కాలేదని కాంగ్రెస్ వాళ్లను అడ్డుకోండని మేం పిలుపునిస్తే మీరు ఊర్లళ్లల్లో తిరుగుతరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తే మేము కూడా సహకరిస్తాం. సీఎంకు పాలబిషేకం చేస్తాం. మీరు ముందుకు రండి కలిసి పని చేద్దాం. వాళ్ళు దగ్గర పెట్టుకొని పని చేద్దాం అన్నారు. కార్యక్రమంలో డీపీఎం రాజయ్య, ఏపీడి మధుసూదన్, తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవ సాయాధికారి మోహన్, ఏపీఎం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దోమల కొమురయ్య, మహి ళా సమైక్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులు అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని కరకపట్ల గ్రామంలో ఆదివారం కూరగాయల సంతలో తప్పి పోయిన పిల్లలను పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు.సంతలో వస్తువులు కొనుక్కోవడానికి మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో నివాసముండే బీహార్ రాష్ట్రానికి చెందిన పిల్లలు నీసా (10), శివానీ (7), శివ (3)లు తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి రోడ్డు మీద తిరుగుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ పోలీసులు తప్పిపోయిన పిల్లల నుంచి వివరాలను తెలుసుకొని వారి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించిన మర్కుక్ ఏఎస్ఐ రవీందర్, కానిస్టేబుల్ జ్యోతిలను పలువురు అభినందించారు. ..

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- సన్న వడ్లకు క్వింటాల్ కు రూ.500 బోనస్

నవతెలంగాణ-నంగునూరు

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. సోమవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా సంబంధించిన అధికారులు చూడాలని అన్నారు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని గుర్తు చేశారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా ఎక్కడైనా అదనంగా కొనుగోలు కేంద్రం అవసరముందని రైతులు కోరితే తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కొత్త కేంద్రలు ఏర్పాటు చేయిస్తామన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే అధికారులకు ముఖ్యమంత్రి సూచించారన్నారు . సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అప్రమత్తం ఉండాలన్నారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చేయలన్నారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్ మాల్ జరిగే ప్రమాదముందని హెచ్చరించారు. అటువంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు .ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పెట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బస్వరాజు రాములు, అప్పలాయచెరువు, నాగరాజు పల్లి గ్రామాల అధ్యక్షులు ముత్యం రెడ్డి, చేర్యాల బాలయ్య, పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నందారం గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ కమిటీని సోమవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ నియామకంలో గౌరవ సలహాదారులుగా మంగళారపు రామయ్య, కాసర్ల గంగయ్య, వాసాల కనకయ్య, చైర్మెన్‌గా వాసాల కిష్టయ్య అధ్యక్షులుగా వాసాల రవి, ప్రధాన కార్యదర్శిగా మాదాసు బిక్షపతి, కోశాధికారిగా వాసాల సుధాకర్, ఉపాధ్యక్షులు వాసాల శ్రీనివాస్, మాదాసు రాజులు ఎన్నికయ్యారు. ఈ సంఘంలో యువకులు ఉత్సాహంగా నూతన సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వాసాల వెంకటేష్, మాజీ ప్రధాన కార్యదర్శి వాసాల బిక్షపతి, మాజీ కోశాధికారి వాసాల శ్రీనివాస్ లతో పాటు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

